ఉత్తరం
కాకతీయ
TG TEL/25/A1234
www.kakatiyanews.com
మంగళవారం, 13 అక్టోబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 53 | పేజీలు: 4 వెల: 5

# ఆర్థిక ఒడుదొడుకులకు చెక్!



- స్థూల ఆర్థిక స్థిరీకరణపై హాల్, వుడ్‌ఫోర్డ్ పరిశోధనలు
- ఆర్థిక శాస్త్రంలో ఇద్దరికి నోబెల్ పురస్కారం
- సూక్ష్మ ఆర్థిక పునాదులతో కొత్త నమూనాలు
- ద్రవ్యోల్బణం, మందగమనాన్ని అంచనా వేసే విధానాలు
- ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకులకు దిశానిర్దేశం
- అమెరికా ఆర్థికవేత్తలు రాబర్ట్ ఇ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు గుర్తింపు

2

## నాపై చేసిన ఫిర్యాదు అవాస్తవం

- జేఎన్‌టీయూలో అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి
- ఫోన్ కాల్ రికార్డులు, సీసీటీవీ దృశ్యాలు పరిశీలించాలి
- మహిళా ప్రొఫెసర్లకు వీసీ క్షమాపణ చెప్పాలి
- ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్పష్టం



3

## రసీదు ఇవ్వకుండా వసూళ్లు

- అధికారుల జేబుల్లోకి మార్కెట్ సొమ్ము
- కిరాయి డబ్బులు సొంత ఖర్చులకు మళ్లింపు
- అధికారి వ్యవహారంపై సెక్రటరీకి బాధితుడి ఫిర్యాదు
- పన్ను వసూళ్లపై జమపై వెలుగులోకి కొత్త



4




# ఓట్-చోరీకి మోదీ, షా, జ్ఞానేష్ కుట్ర

## ఇది మరో స్వాతంత్ర్య పోరాటం

- 'సైమన్ గో బ్యాక్' స్ఫూర్తితో 'జ్ఞానేశ్ గో బ్యాక్' ఉద్యమం
- మైనారిటీ, దళిత, గిరిజన, పేదల ఓట్ల తొలగింపునకు యత్నం
- ఓటు చోరీకి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ నేతృత్వంలో తీవ్ర పోరు
- ఆయనతో కలిసి కదం తొక్కాలి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఢిల్లీలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సీఎం దిశానిర్దేశం

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** దేశ ప్రజల ఓటు హక్కును కాపాడుకునేందుకు జరుగుతున్న పోరాటం మరో స్వాతంత్ర్య ఉద్యమమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకత్వంలో ఈ పోరాటం కొనసాగుతోందని తెలిపారు. బ్రిటిష్ పాలన నుంచి దేశానికి స్వేచ్ఛ, స్వపరిపాలన కల్పించేందుకు ఆనాడు కాంగ్రెస్ నాయకులు పోరాడారని, ఇప్పుడు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకునేందుకు పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని సీఎం తెలిపారు. ఓటు బచావో.. దేశ్ బచావో ఆందోళనలో భాగంగా ఢిల్లీ తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఆనాడు స్వాతంత్ర్యం కోసం 'సైమన్ గో బ్యాక్' ఉద్యమం సాగిందని, ఇప్పుడు ఓటు హక్కును కాపాడుకునేందుకు 'జ్ఞానేశ్ గో బ్యాక్', 'ఎస్ఐఆర్ గో బ్యాక్' నినాదాలతో ఉద్యమించాల్సిన అవసరం వచ్చిందని సీఎం అన్నారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ముందుపెట్టి, ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రజల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని సీఎం ఆరోపించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో లాలా లజపతిరాయ్, భగత్‌సింగ్, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ వంటి నాయకుల త్యాగాలు చిరస్మరణీయమని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. 'సైమన్ గో బ్యాక్' ఉద్యమ సమయంలో లాలా లజపతిరాయ్ లాఠీచార్జీలో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఎందరో నాయకుల త్యాగాలు, పోరాటాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని పేర్కొన్నారు.

........(తరువాయి 2లో)

# కేసీఆర్ బాటలోనే మోదీ!

## ధర్నాచౌక్ ఎత్తేసిన కేసీఆర్‌కు పట్టిన గతే మోదీకీ పడుతుంది

- జంతర్‌మంతర్‌పై ఆంక్షలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం
- ప్రజల గొంతు నొక్కితే ఎన్నికల్లో బుద్ధి చెబుతారు
- నిరసన తెలిపే హక్కును కాలరాయొద్దు
- రాష్ట్రంలో కేసీఆర్.. దేశంలో మోదీ అదే విధానం
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** ప్రజల గొంతు నొక్కిన పాలకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌ను ఎత్తేసిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రజలు ఎన్నికల్లో తగిన సమాధానం చెప్పారని, ఇప్పుడు ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద నిరసనలపై ఆంక్షలు విధిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి కూడా అదే పరిస్థితి ఎదురవుతుందని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి, రాజకీయ పార్టీకి రాజ్యాంగం కల్పించిందని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ ప్రజలు, రాజకీయ పార్టీలు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు వేదికగా ఉండేదని పొంగులేటి గుర్తుచేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ధర్నాచౌక్‌ను ఎత్తివేసి నిరసన తెలిపే అవకాశాన్ని దెబ్బతీసిందని విమర్శించారు. ప్రజల సమస్యలను

........(తరువాయి 2లో)

# ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు!

- నీళ్లున్నా మోటార్లు నడపలేని అసమర్థ ప్రభుత్వం
- కరువు వేళ రైతులతో వీడియో కాన్ఫరెన్స్ పేరుతో గందరగోళం
- బొగ్గు నిల్వలు లేవు.. కరెంటు కోతలు.. ఎండుతున్న పంటలు
- సాగునీటికి రైతుల ఆందోళన.. మద్యం కంపెనీలకు నీళ్లా?
- రైతు బీమా ఏది.. వలస కూలీలకు భరోసా ఏది?
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు



**కాకతీయ,తెలంగాణ బ్యూరో:** రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొని రైతులు సాగునీరు, విద్యుత్తు లేక అల్లాడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంపై నెలలుగా హెచ్చరికలు వస్తున్నా ముందస్తు చర్యలు తీసుకోలేదని, ఇప్పుడు కేబినెట్ సమావేశం నిర్వహించలేని, ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌ను సక్రమంగా కొనసాగించలేని పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఏర్పడిన పరిస్థితి అని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు వేదికలకు ఉదయం 11 గంటలకు రావాలని, ముఖ్యమంత్రి మాట్లాడతారని రైతులకు సందేశాలు పంపారని హరీశ్‌రావు తెలిపారు. రాత్రి 12 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని ఎమ్మెల్యేలకు సమాచారం ఇచ్చి, ఉదయం 9.52 గంటలకు రద్దు చేసినట్లు సందేశం పంపారని చెప్పారు. మళ్లీ నిర్వహిస్తామని చెప్పి మరోసారి రద్దు చేశారని, చివరకు ముఖ్యమంత్రి స్థానంలో ఉప ముఖ్యమంత్రి వస్తారని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. కరవుపై తీవ్రంగా చర్చిస్తామని మంత్రి పొంగులేటి చెప్పినప్పటికీ, ముఖ్యమంత్రి గోవాకు, మంత్రులు ఢిల్లీకి వెళ్లారని విమర్శించారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. తొమ్మిది నెలలుగా ఎల్‌నినో ప్రభావంపై హెచ్చరికలు వస్తున్నా రైతుల కోసం తీసుకున్న చర్యలేమిటో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు.

**బొగ్గు లేదు.. కరెంటు లేదు.. నీళ్లు లేవు**

బొగ్గు కొరత,

....(తరువాయి 2లో)

## అన్నపూర్ణేశ్వరిగా

# భద్రకాళీ అమ్మవారు



## శరన్నవరాత్రుల్లో రెండో రోజు విశేష అలంకారం

- మకర, చంద్రప్రభ వాహనాలపై అమ్మవారి సేవలు
- హరికథ, కూచిపూడి నృత్యాలతో భక్తులకు ఆధ్యాత్మిక విందు

**కాకతీయ, వరంగల్ బ్యూరో:** ఆకలిని తీర్చే అన్నపూర్ణేశ్వరిగా.. భక్తులకు అభయమిచ్చే భద్రకాళిగా.. పూజలందుకుంటున్న అమ్మవారి దివ్యరూపం భక్తులను పరవశింపజేసింది. పూల అలంకరణలు.. మంగళవాయిద్యాలు.. భక్తి గీతాల నడుమ కాకతీయుల రాజధాని ఏకశిలా నగరమైన వరంగల్‌లోని శ్రీ భద్రకాళీ దేవస్థానం శరన్నవరాత్రి ఉత్సవాలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. రెండో రోజు సోమవారం అమ్మవారిని అన్నపూర్ణేశ్వరిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం 4 గంటలకు నిత్యాహ్నిక కార్యక్రమాలు పూర్తయిన అనంతరం అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఉదయం బ్రహ్మచారిణి దుర్గగా,

........(తరువాయి 2లో)

# ఓరుగల్లుకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ!

- రూ.5,257 కోట్ల ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం
- కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకు రుణంతో పనులకు ముందడుగు
- వరంగల్, హనుమకొండలో ఏడు జోన్లుగా పనులు
- ఏడు చోట్ల మురుగునీటి శుద్ధి కేంద్రాలు
- 66 డివిజన్లలో ప్రణాళికల రూపకల్పన
- 20 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా అంచనాలు



4

# ట్రాఫిక్‌కు పాడ్ ట్యాక్సీ!

- ఐటీ కారిడార్‌లో మూడు మార్గాలకు సీఎం పచ్చజెండా
- రాయదుర్గం–కూకట్‌పల్లి, హైటెక్‌సిటీ-నాలెడ్జ్ సిటీ, కొండాపూర్-ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మార్గాల్లో ప్రతిపాదనలు
- కిలోమీటరుకు రూ.180 కోట్ల వరకు వ్యయం
- ప్రతి కారిడార్‌కు మూడు ప్రత్యామ్నాయాలు
- భద్రతకే తొలి ప్రాధాన్యం.. నాలుగో మార్గంపై అధ్యయనం
- మెట్రో, ఎంఎంటీఎస్, ఆర్టీసీకి అనుబంధంగా కొత్త రవాణా వ్యవస్థ




2

# కుమార్తె కార్పొరేట్ స్కూల్‌పై సీఎం జవాబు చెప్పాలి

- విద్యను వ్యాపారం చేయొద్దన్న సీఎం
- మైండ్ వాల్ట్ స్కూల్ పెట్టుబడులపై అనుమానాలు నివృత్తి చేయాలి
- భూమి కొనుగోలు, నిర్మాణ నిధుల మూలాలు వెల్లడించాలి
- మెడికవర్ డైరెక్టర్లతో సంస్థకు ఉన్న సంబంధాలపై స్పష్టత ఇవ్వాలి
- రూ.2.5 లక్షల ఫీజు వసూలు చేస్తారా?
- ప్రభుత్వ విద్యను విస్మరించి కార్పొరేట్ విద్యకు ప్రోత్సాహమా?
- బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్

2

# ట్రాఫిక్‌కు పాడ్ ట్యాక్సీ!



**హైదరాబాద్:** భాగ్యనగరంలో ట్రాఫిక్ కష్టాలకు తెరదించే దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కొత్త రవాణా వ్యవస్థకు కసరత్తు చేస్తోంది. మెట్రో, ఎంఎంటీఎస్, ఆర్టీసీ సేవలకు అనుబంధంగా పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ (పీఆర్‌టీ) లేదా పాడ్ ట్యాక్సీ వ్యవస్థను తీసుకొచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. నగరంలో పెరుగుతున్న వాహనాల రద్దీని తగ్గించడం, ప్రధాన ఐటీ ప్రాంతాల మధ్య ప్రయాణాన్ని సులభతరం చేయడం ఈ ప్రాజెక్టు లక్ష్యంగా కనిపిస్తోంది. ఇటీవల లీ అసోసియేట్స్ సంస్థ సమర్పించిన నివేదికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిశీలించారు. ప్రతిపాదిత నాలుగు కారిడార్లలో ఐటీ ప్రాంతాలకు సంబంధించిన మూడు మార్గాలకు ఆయన ఆమోదం తెలిపినట్లు సమాచారం. ఈ మార్గాల్లో ఒక్కోదానికి మూడు ప్రత్యామ్నాయాలను రూపొందించాలని సంబంధిత సంస్థను ఆదేశించారు.

**ఐటీ కారిడార్‌పై ప్రత్యేక దృష్టి**

నగరంలో ఉద్యోగులు, ఇతర ప్రయాణికుల రాకపోకలు అధికంగా ఉండే ఐటీ ప్రాంతాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. రాయదుర్గం-కూకట్‌పల్లి, హైటెక్‌సిటీ-రాయదుర్గం నాలెడ్జ్ సిటీ, కొండాపూర్-ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మార్గాల్లో పీఆర్‌టీ వ్యవస్థ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఆయా ప్రాంతాల మధ్య రాకపోకలకు వేగవంతమైన ప్రత్యామ్నాయాన్ని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా రహదారులపై వాహనాల ఒత్తిడిని తగ్గించవచ్చని భావిస్తున్నారు. ఈ మూడు కారిడార్లలో ఒక్కో మార్గానికి మూడు వేర్వేరు ప్రత్యామ్నాయాలను రూపొందించాలని సీఎం సూచించారు. వాటి సాధ్యాసాధ్యాలు, నిర్మాణ అవసరాలు, ప్రయాణికులకు కలిగే ప్రయోజనాలను పరిశీలించిన తర్వాత తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

**పాడ్ ట్యాక్సీ ఎలా ఉపయోగపడుతుంది?**

పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ వ్యవస్థలో చిన్న వాహనాలు లేదా పాడ్‌లు ప్రత్యేక మార్గాల్లో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తాయి. సంప్రదాయ రవాణా వ్యవస్థలతో పోలిస్తే ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా సేవలను అందించే అవకాశం ఉంటుంది. అయితే హైదరాబాద్‌లో ప్రతిపాదించిన ప్రాజెక్టులో ఈ వ్యవస్థకు సంబంధించిన పూర్తి సాంకేతిక వివరాలు, సామర్థ్యం, స్టేషన్ల సంఖ్య, ప్రయాణికుల రవాణా సామర్థ్యం ఇంకా స్పష్టంగా వెల్లడికాలేదు. ప్రతిపాదనలు తుది రూపు దాల్చిన తర్వాతే వ్యవస్థ స్వరూపంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న మెట్రో, ఎంఎంటీఎస్, ఆర్టీసీ సేవలకు అనుసంధానంగా దీన్ని రూపొందిస్తే ఒక రవాణా మార్గం నుంచి మరో మార్గానికి మారే ప్రయాణికులకు ప్రయోజనం కలగనుంది.

**మెట్రో విస్తరణపైనా కసరత్తు**

మరోవైపు, పాతబస్తీ సహా హైదరాబాద్‌లో ప్రతిపాదించిన నాలుగు మెట్రోరైలు కారిడార్లకు సంబంధించిన జనరల్ కన్సల్టెన్సీ టెండరు గడువును అధికారులు పొడిగించారు. అక్టోబరు 8తో ముగియాల్సిన గడువును ఈ నెల 22 వరకు పెంచారు. నిర్ణీత గడువులో తగిన స్పందన రాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పీఆర్‌టీ ప్రతిపాదనలు, మెట్రో విస్తరణ ప్రణాళికలు సమాంతరంగా ముందుకు సాగితే నగర ప్రజా రవాణా వ్యవస్థకు మరిన్ని ప్రత్యామ్నాయాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే ప్రాజెక్టుల అమలు, నిర్మాణ గడువులు, నిధుల కేటాయింపుపై స్పష్టత వచ్చినప్పుడే వాటి పురోగతిపై అంచనా వేయగలుగుతారు.

### కిలోమీటరుకు రూ.180 కోట్ల వరకు వ్యయం

పీఆర్‌టీ వ్యవస్థ నిర్మాణానికి కిలోమీటరుకు సుమారు రూ.120 కోట్ల నుంచి రూ.180 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. నిర్మాణ వ్యయం, నిర్వహణ, ప్రయాణికుల భద్రత వంటి అంశాలు ప్రాజెక్టు అమలులో కీలకంగా మారనున్నాయి. ఆదాయం కంటే ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సాంకేతిక ప్రమాణాలు, రవాణా నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై సమగ్ర అధ్యయనం అవసరం కానుంది. అసెంబ్లీ, లక్డీకాపూల్, సచివాలయం, ట్యాంక్‌బండ్ ప్రాంతాలను అనుసంధానించేలా నాలుగో కారిడార్‌ను ప్రతిపాదించారు. ఈ మార్గంలో కొన్ని సాంకేతిక సవాళ్లు ఉన్నట్లు గుర్తించడంతో ప్రత్యామ్నాయాలపై మరింత లోతుగా అధ్యయనం చేయాలని సీఎం అధికారులకు సూచించారు. ఈ కారిడార్‌ను రాణిగంజ్ వరకు పొడిగించే సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆదేశించారు. మార్గం ఎంపిక, నిర్మాణ సాధ్యత, ప్రయాణికుల అవసరాలను పరిగణనలోకి తీసుకుని తదుపరి నిర్ణయం తీసుకోనున్నారు.

# కుమార్తె కార్పొరేట్ స్కూల్‌పై సీఎం జవాబు చెప్పాలి



**కాకతీయ, హైదరాబాద్ :** విద్యను వ్యాపారంగా మార్చొద్దని గతంలో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఆయన కుమార్తె ఎనుముల నైమిశారెడ్డి పేరుతో ముడిపడిన కార్పొరేట్ పాఠశాల నిర్మాణంపై వస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ డిమాండ్ చేశారు. కొంపల్లిలో నిర్మాణంలో ఉన్న మైండ్ వాల్ట్ కార్పొరేట్ స్కూల్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. పాఠశాల పెట్టుబడుల మూలాలు, భూమి కొనుగోలు, నిర్మాణ వ్యయానికి సంబంధించిన వివరాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. మెడికవర్ ఆసుపత్రి విక్రయం ద్వారా వచ్చిన నిధులను మైండ్ వాల్ట్ కార్పొరేట్ స్కూల్‌లో పెట్టుబడులుగా పెట్టారా అనే అనుమానాలను క్రిశాంక్ వ్యక్తం చేశారు. ఈ పెట్టుబడులకు సంబంధించిన ఆర్థిక లావాదేవీల వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రూ.50 వేల కోట్ల అవినీతి జరిగిందంటూ తాము చేస్తున్న ఆరోపణలకు సంబంధించి ఈ పెట్టుబడులపై స్పష్టత అవసరమని పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించి ఆధారాలు, అధికారిక విచారణ వివరాలను ఆయన మీడియా సమావేశంలో పూర్తిగా వెల్లడించలేదు.

**భూమి కొనుగోలుపై వివరాలేవీ?**

2025 జులై 4న పాఠశాలకు సంబంధించిన భూమి కొనుగోలు జరిగినట్లు సేల్ డీడ్‌లో ఉందని క్రిశాంక్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే ఇంత పెద్ద స్థాయిలో భూమి కొనుగోలు చేసి, భారీ పాఠశాల నిర్మాణం చేపట్టేందుకు నిధులు ఎక్కడి నుంచి సమకూరాయో వివరించాలని కోరారు. మైండ్ వాల్ట్ వెంచర్స్ సంస్థ ద్వారా నిర్మాణ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలోని సంస్థ రిజిస్టర్డ్ చిరునామాకు సంబంధించి ఎనుముల నైమిశారెడ్డి, దుంప శిరీష, దుంప బ్రహ్మానందరెడ్డి, బేతి విజయశ్రీ, శిరీష పరంకుశం పేర్లను ప్రస్తావించారు. నైమిశారెడ్డి మినహా మిగిలిన వ్యక్తులు మెడికవర్ ఆసుపత్రి డైరెక్టర్లుగా ఉన్నారని చెబుతూ, ఆయా సంస్థల మధ్య సంబంధాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొంపల్లిలో నిర్మిస్తున్న పాఠశాలను హైదరాబాద్‌లోని కొల్లూరుతో పాటు ఇతర ప్రాంతాలకు విస్తరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని క్రిశాంక్ పేర్కొన్నారు. ఒక్కో విద్యార్థి నుంచి రూ.2.5 లక్షల వరకు ఫీజు వసూలు చేస్తారా అని ప్రశ్నించారు. గురుకుల పాఠశాలల సమస్యలను పరిష్కరించకుండా కార్పొరేట్ విద్యాసంస్థలకు ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి కుటుంబానికి సంబంధించిన వ్యాపారాలపై కాంగ్రెస్ నాయకులు ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు.

**ఇతర వ్యాపారాలపైనా విమర్శలు**

ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు సంబంధించిన భూములు, కంపెనీల ఒప్పందాలు, వాహన విక్రయ సంస్థలు, ఆసుపత్రుల వ్యాపారాలపై కూడా క్రిశాంక్ ఆరోపణలు చేశారు. కొండల్‌రెడ్డికి రూ.200 కోట్ల విలువైన భూమి అప్పగించారని, జగదీశ్వర్‌రెడ్డి సంబంధిత సంస్థకు రూ.వెయ్యి కోట్ల ఒప్పందం జరిగిందని, ముఖ్యమంత్రి కుటుంబానికి సంబంధించిన ఇతర వ్యాపారాలకు ప్రోత్సాహం లభిస్తోందని పేర్కొన్నారు. ఈ ఆరోపణలకు సంబంధించిన పత్రాలు, లావాదేవీల వివరాలను స్వతంత్రంగా ధ్రువీకరించాల్సి ఉంది. మైండ్ వాల్ట్ స్కూల్ పెట్టుబడులు, భూమి కొనుగోలు, నిర్మాణ వ్యయం, సంబంధిత సంస్థల ఆర్థిక లావాదేవీలపై పూర్తి వివరాలను వెల్లడించాలని క్రిశాంక్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కుటుంబానికి సంబంధించిన వ్యాపార వ్యవహారాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు.

# ఆర్థిక ఒడుదొడుకులకు చెక్!

**కాకతీయ,నేషనల్ డెస్క్ :** ఆర్థిక వ్యవస్థలో ఒడుదొడుకులను తగ్గించి స్థిరత్వాన్ని సాధించే విధానాల రూపకల్పనలో కీలక పరిశోధనలు చేసిన అమెరికా ఆర్థికవేత్తలు రాబర్ట్ ఇ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌లను నోబెల్ పురస్కారం వరించింది. స్థూల ఆర్థిక స్థిరీకరణకు సూక్ష్మ ఆర్థిక పునాదులను అభివృద్ధి చేసినందుకు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సోమవారం ఈ పురస్కారాన్ని ప్రకటించింది. ఆర్థిక వ్యవస్థలో వృద్ధి, మందగమనం, ద్రవ్యోల్బణం వంటి పరిణామాలను అర్థం చేసుకోవడంతోపాటు వాటిని నియంత్రించేందుకు అనుసరించాల్సిన విధానాలపై వీరి పరిశోధనలు కొత్త దిశను చూపించాయి. కుటుంబాలు ఎంత ఖర్చు చేయాలి? వ్యాపార సంస్థలు ఎంత పెట్టుబడి పెట్టాలి? వడ్డీ రేట్లలో మార్పులు జరిగితే వినియోగం, ఉత్పత్తిపై ఎలాంటి ప్రభావం పడుతుంది? ఇలాంటి సూక్ష్మస్థాయి నిర్ణయాలు మొత్తం ఆర్థిక వ్యవస్థను ఎలా ప్రభావితం చేస్తాయన్న అంశాలకు హాల్, వుడ్‌ఫోర్డ్ పరిశోధనలు ప్రాధాన్యమిచ్చాయి. వ్యక్తులు, కుటుంబాలు, సంస్థల నిర్ణయాలను ఆధారంగా చేసుకుని స్థూల ఆర్థిక పరిణామాలను విశ్లేషించే నమూనాల అభివృద్ధికి వీరి కృషి దోహదపడింది.

**విధానాల ప్రభావాన్ని అంచనా వేసే నమూనాలు**

ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి, వినియోగం, ధరలు, ఉపాధి పరస్పరం అనుసంధానమై ఉంటాయి. ఒక రంగంలో మార్పు మరో రంగంపై ప్రభావం చూపుతుంది. ఈ సంబంధాలను సూక్ష్మ ఆర్థిక సూత్రాల ఆధారంగా విశ్లేషించడం ద్వారా ఆర్థిక విధానాల ప్రభావాన్ని అంచనా వేయడానికి మెరుగైన పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. వీరి పరిశోధనలతో ముడిపడిన న్యూ కీనేసియన్ నమూనాలు ఆర్థిక ఒడుదొడుకులు, ధరల మార్పులు, విధాన నిర్ణయాల ప్రభావాన్ని అధ్యయనం చేయడంలో కీలకంగా మారాయి. ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు వడ్డీ రేట్లలో మార్పులు చేయడం, ఆర్థిక కార్యకలాపాలు మందగించినప్పుడు తగిన ద్రవ్య, ఆర్థిక విధానాలను అనుసరించడం ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకులకు కీలకం. పన్నులు, ప్రభుత్వ వ్యయం, వడ్డీ రేట్లు వంటి అంశాల్లో మార్పులు ఆర్థిక వ్యవస్థపై చూపే ప్రభావాన్ని అంచనా వేయడంలో ఈ నమూనాలు ఉపయోగపడుతున్నాయి. విధాన నిర్ణయాలను సరైన సమయంలో తీసుకోవడం ద్వారా ఆర్థిక హెచ్చుతగ్గుల తీవ్రతను తగ్గించేందుకు వీలు కలుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక విధానాల రూపకల్పనలో వీరి పరిశోధనలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు!

**(మొదటిపేజీ తరువాయి)**




విద్యుత్తు కోతలకు ఎల్‌నినోను కారణంగా చూపడం సరికాదని హరీశ్‌రావు అన్నారు. నైనీ బొగ్గు గని నుంచి ముందుగానే నిల్వలు ఎందుకు సమకూర్చుకోలేదని ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాలు ముందస్తుగా విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు చేసుకున్నాయని, తెలంగాణలో మాత్రం యూనిట్‌కు రూ.10 నుంచి రూ.15 చెల్లించినా విద్యుత్తు దొరకడం లేదని ప్రభుత్వం చెబుతోందన్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆరు నుంచి ఏడు గంటల విద్యుత్తు కూడా సక్రమంగా అందడం లేదని, పంటలు ఎండిపోతుండటంతో రైతులు సబ్‌స్టేషన్ల వద్ద ఆందోళనలు చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యుత్తు కొరతతో సాగునీరు అందక రైతులు నష్టపోతున్నారని, ఈ పరిస్థితికి ప్రభుత్వ ముందుచూపు లేమే కారణమని ఆరోపించారు.

**ప్రాజెక్టులున్నా నీళ్లెందుకు ఎత్తడం లేదు?**

దేవాదుల, కన్నెపల్లి పంప్‌హౌస్‌లను పూర్తిస్థాయిలో వినియోగించడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. సమ్మక్క సాగర్ వద్ద నీటి ప్రవాహం ఉన్నప్పటికీ దేవాదుల మోటార్లను పరిమిత సమయం మాత్రమే నడుపుతామని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. మోటార్లను పదేపదే ఆన్, ఆఫ్ చేయడం వల్ల వాటి పనితీరుపై ప్రభావం పడుతుందని చెప్పినా పట్టించుకోలేదన్నారు. దేవాదులలో మోటార్ల బేరింగులు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. కల్వకుర్తి మోటార్లను నిరంతరం నడిపితే పాలమూరు ప్రాంతంలో విస్తారంగా సాగునీరు అందించే అవకాశం ఉందని చెప్పారు. గతంలో చేపట్టిన ప్రాజెక్టుల రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

**సింగూరు నీళ్లు మద్యం కంపెనీలకా?**

సింగూరు ప్రాజెక్టు మరమ్మతులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేశారని హరీశ్‌రావు విమర్శించారు. గత ఏడాది ప్రాజెక్టులో 29 టీఎంసీల నీరు ఉండగా, మరమ్మతుల పేరుతో నీటిని వదిలేశారని, పనులు మాత్రం పూర్తికాలేదని ఆరోపించారు. ప్రస్తుతం మూడు టీఎంసీల నీరు మాత్రమే ఉందని, అందులో ఒక టీఎంసీ డెడ్ స్టోరేజీ అని చెబుతున్నారని పేర్కొన్నారు. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలతో పాటు హైదరాబాద్‌కు నీరందించే కీలక ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. తాగునీరు, సాగునీటికి ఇబ్బందులు ఉన్న సమయంలో మద్యం ఉత్పత్తి సంస్థలకు నీటి కేటాయింపులపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల పంటలకు నీళ్లు తీసుకున్నందుకు కేసులు పెడుతున్న ప్రభుత్వం, నీటి వినియోగంపై ఇతర సంస్థల విషయంలోనూ ఒకే విధమైన నిబంధనలు అమలు చేయాలన్నారు.

**రైతు బీమా ఏది.. భరోసా ఏది?**

నుంచి మరణించిన రైతుల కుటుంబాలకు రైతు బీమా సొమ్ము అందడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. రైతు బంధు, రైతు బీమా సహా పథకాల నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యాసంగిలో పంటలు వేయొద్దంటూ సలహాలు ఇవ్వడం కాకుండా, రైతులు, రైతు కూలీలకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరారు. పాలమూరు ప్రాంతం నుంచి కూలీలు కర్ణాటకకు వలస వెళ్లి రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, వలసలను నివారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులను భయపెట్టకుండా భరోసా కల్పించాలని, కరెంటు కోతలు, నీటి కొరతపై సమగ్ర కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, సంజయ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, దూదిమెట్ల బాలరాజు, అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిషోర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ బాటలోనే మోదీ!

**(మొదటిపేజీ తరువాయి)**

వినకుండా నిరసనలకు వేదిక లేకుండా చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. నిరసన హక్కును కాలరాసిన కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారని పేర్కొన్నారు.

**జంతర్‌మంతర్‌పై ఆంక్షలేంటి?**

ఢిల్లీలో ప్రజలు, రాజకీయ పార్టీలు తమ సమస్యలను వినిపించుకునేందుకు జంతర్‌మంతర్ వంటి ప్రాంతాలు చారిత్రకంగా నిరసన వేదికలుగా ఉపయోగపడుతున్నాయని మంత్రి తెలిపారు. అక్కడ నిరసనలపై ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. హైదరాబాద్‌లో కేసీఆర్ అనుసరించిన విధానాన్నే దేశ రాజధానిలో మోదీ ప్రభుత్వం అమలు చేస్తోందని ఆరోపించారు. ప్రజల సమస్యలను వినకుండా, ప్రతిపక్షాలకు తమ అభిప్రాయాలను వెల్లడించే అవకాశం లేకుండా చేయడం సరైన విధానం కాదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాల విధానాలను ప్రశ్నించే హక్కు ప్రజలకు ఉంటుందని పొంగులేటి స్పష్టం చేశారు. ప్రజల గొంతును అణచివేయాలని చూసే పాలకులకు చివరకు ప్రజల తీర్పే సమాధానమవుతుందని అన్నారు. ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌ను ఎత్తివేసిన కేసీఆర్‌కు ఎదురైన రాజకీయ పరిణామాలే భవిష్యత్తులో మోదీకి కూడా ఎదురవుతాయని వ్యాఖ్యానించారు. నిరసనలకు అవకాశం కల్పించడం, ప్రజల సమస్యలను వినడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్నారు.

# అన్నపూర్ణేశ్వరిగా భద్రకాళీ అమ్మవారు

**(మొదటిపేజీ తరువాయి)**

సాయంత్రం దేవజా దుర్గగా ఆరాధించారు. ఉదయం మకర వాహన సేవ, సాయంత్రం చంద్రప్రభ వాహన సేవ నిర్వహించారు. మకర వాహనంపై గంగాభవానిగా, చంద్రప్రభ వాహనంపై రాజరాజేశ్వరిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. రెండో రోజు అన్నపూర్ణేశ్వరి అలంకారానికి విశిష్ట ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉందని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు వివరించారు. సాధకుడికి తల్లితో కలిసి భోజనం పెట్టే సంప్రదాయానికి ప్రతీకగా ఈ అలంకారం నిర్వహిస్తారని తెలిపారు. అన్నపూర్ణేశ్వరిగా అమ్మవారిని దర్శించుకుంటే ఆకలి బాధలు తొలగి అన్నప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసమన్నారు.

**ఆధ్యాత్మిక విశిష్టతతో వాహన సేవలు**

నవరాత్రి క్రమంలో బ్రహ్మచారిణి దుర్గను ఆరాధించడం వల్ల సాధకులు స్వాధిష్ఠాన చక్రంపై దృష్టి కేంద్రీకరించి విష్ణుమూర్తి అనుగ్రహానికి పాత్రులవుతారని, తద్వారా జ్ఞానం, అధికారం సిద్ధిస్తాయని భద్రకాళి శేషు వివరించారు. దేవజా దుర్గ సమస్త దేవతాశక్తులకు ప్రతిరూపమని, సాధకులను బాధించే అసుర శక్తులను సంహరిస్తుందని పేర్కొన్నారు. మకర వాహనంపై గంగాభవానిగా అమ్మవారిని దర్శించుకుంటే జలగండాలు తొలగుతాయని, చంద్రప్రభ వాహనంపై రాజరాజేశ్వరిగా సేవిస్తే మనసులోని చంచలత్వం తగ్గి స్థిరత్వం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు. అనంతరం ఆలయ మహామండపంలో మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

**సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి**

సాయంత్రం నిర్వహించిన హరికథ, భక్తి సంగీతం, కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో సూర్యకుటీర్ అధినేతలు తంగళ్లపల్లి తిరుమలాదేవి, సంపత్‌కుమార్, హర్షవర్ధన్-డాక్టర్ మానస దంపతులు, కుమారి వైష్ణవి, బైరి రవికృష్ణగౌడ్-సరోజన దంపతులు, హరికృష్ణ-హరిత దంపతులు, ఊడుగుల సాయికిరణ్-డాక్టర్ హర్షిత దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. అలాగే గీతాభవన్, రాఘవేంద్ర టిఫిన్స్ హోటల్స్ అధినేతలు బాలచంద్రహోళ్ళ-రేణుక దంపతులు, చంద్రశేఖర శెట్టి-జ్యోతి దంపతులు, కొప్పు నాగరాజశెట్టి-ప్రభావతి దంపతులు, అన్నపశెట్టి-హేమ దంపతులు, సందీప్ దీవెశెట్టి-సమత దంపతులు ఉభయదాతలుగా సేవలందించారు. శరన్నవరాత్రి ఉత్సవాలను ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత పర్యవేక్షించారు.



# ఓట్-చోరీకి మోదీ, షా, జ్ఞానేష్ కుట్ర

**(మొదటిపేజీ తరువాయి)**

అయితే, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం దేశ ప్రజలకు ఓటు అనే శక్తిమంతమైన ఆయుధాన్ని అందించిందన్నారు. రాజరిక, కుటుంబ పాలనలకు ముగింపు పలికి ప్రజల చేతిలో అధికారం పెట్టడంలో ఓటు హక్కు కీలక పాత్ర పోషించిందని సీఎం తెలిపారు. పేదలు, దళితులు, గిరిజనులు సహా అన్ని వర్గాల ప్రజలకు ఓటు హక్కు కల్పించడం ద్వారా అంబేడ్కర్ సమానత్వానికి బాటలు వేశారని సీఎం కొనియాడారు.

**గతంలో ఓటు హక్కు కల్పించేందుకు ఎస్ఐఆర్**

గతంలోనూ ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. 1950లో జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్న సమయంలో ఈ ప్రక్రియ ద్వారా ఓటు హక్కు లేని వారికి ఓటు హక్కు కల్పించారని సీఎం గుర్తు చేశారు. దేశ విభజన సమయంలో ప్రజలు ఎక్కడ స్థిరపడ్డారు? ఎవరు ఏ ప్రాంతానికి వెళ్లారు? అనే వివరాలను గుర్తించాల్సిన అవసరం కూడా అప్పట్లో ఏర్పడిందని పేర్కొన్నారు. తర్వాత ఇందిరాగాంధీ, అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వాల కాలంలోనూ ఎస్ఐఆర్ ప్రక్రియ జరిగిందని గుర్తు చేశారు. అయితే, గతంలో ఓటర్ల జాబితాలో పేర్లు లేని అర్హులైన వారిని చేర్చడంపైనే ప్రధానంగా దృష్టి పెట్టేవారని అన్నారు. ఇప్పుడు మోదీ, అమిత్ షాల పాలనలో మాత్రం ఇప్పటికే ఓటు హక్కు ఉన్నవారి పేర్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని సీఎం మండిపడ్డారు. గతంలో ఈ ప్రక్రియను ప్రజలకు మేలు చేసే చర్యగా చూశారని, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం దాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. తమ అధికారానికి అడ్డుగా ఉన్న రాజకీయ ప్రత్యర్థులను దెబ్బతీసేందుకు కేంద్ర ప్రభుత్వం గతంలో ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖ, నార్కోటిక్స్ విభాగం వంటి సంస్థలను ఉపయోగించుకుందని, ఇప్పుడు వాటితో రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కోవడం కష్టమవుతోందనే ఉద్దేశంతో ఎస్ఐఆర్‌ను తెరపైకి తెచ్చారని సీఎం విమర్శించారు. ఈసీఐ ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ముందుపెట్టి మోదీ ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని నడిపిస్తోందని ఆరోపించారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన రాజ్యాంగబద్ధ సంస్థ అని అన్నారు. అలాంటి సంస్థను రాజకీయ అవసరాలకు ఉపయోగించుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని సీఎం హితవు పలికారు. ఎన్నికల సంఘం విశ్వసనీయత దెబ్బతింటే ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.

**పారదర్శకత కోసమే నాడు ఎన్నికల సంఘంలో మార్పులు**

గతంలో ఎన్నికల సంఘం ఒక్క కమిషనర్ నేతృత్వంలో పనిచేసేదని, అయితే, ఈ సంస్థలో మరింత పారదర్శకత తీసుకువచ్చేందుకు ప్రధానమంత్రిగా పి.వి.నరసింహారావు ఉన్న సమయంలో ముగ్గురు కమిషనర్ల విధానాన్ని తీసుకొచ్చారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. గతంలో ఎన్నికల కమిషనర్ల నియామకంలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చేవారని తెలిపారు. ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధాన ప్రతిపక్ష నేత భాగస్వామ్యంతో నియామక ప్రక్రియ సాగేదన్నారు. మోదీ ప్రభుత్వం 2023లో ఈ విధానాన్ని మార్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కమిషనర్ల నియామక ప్రక్రియలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేంద్ర హోంమంత్రిని చేర్చారని ఆరోపించారు. నిర్ణయాలను తమకు అనుకూలంగా తీసుకునేందుకే ఈ మార్పులు చేశారని సీఎం మండిపడ్డారు. ఎన్నికల కమిషనర్ల నియామకంలో నిష్పక్షపాతానికి భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమించే సమయంలోనే రాహుల్‌గాంధీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. జ్ఞానేశ్‌తో ఎస్ఐఆర్ ద్వారా ఓటర్ల తొలగింపునకు అవకాశం కల్పిస్తున్నారని సీఎం ఆరోపించారు.

**దళితులు, గిరిజనులు, పేదల ఓట్లే లక్ష్యమా?**

దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల ప్రజల ఓటు హక్కులను తొలగించేందుకు కుట్ర జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దేశ యువత ఓట్లను తొలగించే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని సీఎం మండిపడ్డారు. సోషల్ మీడియాలో బీజేపీ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టేవారిని లక్ష్యంగా చేసుకుని వారి ఓటు హక్కులను తొలగించే యోచనలో ఉందని సీఎం విమర్శించారు. ఈ ప్రమాదాన్ని తొలుత గుర్తించి దేశ ప్రజల దృష్టికి తీసుకొచ్చింది రాహుల్ గాంధీయేనని సీఎం వెల్లడించారు. మొదట్లో ప్రతిపక్ష పార్టీలు ఈ అంశంపై తగినంతగా దృష్టి పెట్టలేదని, తాజా పరిణామాలతో పరిస్థితి తీవ్రత అందరికీ అర్థమవుతోందన్నారు. ప్రతిపక్ష పార్టీలే కాకుండా అధికార పక్షంలో ఉన్నవారు కూడా ఈ అంశంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బీజేపీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషి వంటి వారు ఈ అంశంపై గొంతెత్తడమే ఇందుకు సంకేతమని సీఎం వ్యాఖ్యానించారు.

**మోదీ, అమిత్ షాల మౌనం ఎందుకు?**

జ్ఞానేశ్ కుమార్ నియామకంలో ఎలాంటి కుట్ర లేదని మోదీ, అమిత్ షాలు భావిస్తే, ఆయనను తొలగించాలనే డిమాండ్లపై ఎందుకు స్పందించడం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వారు ఎందుకు అండగా నిలుస్తున్నారో సమాధానం చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలు చేపడితే ఎందుకు అడ్డుకుంటున్నారని, నిరసనలను ఎందుకు అణచివేస్తున్నారని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఢిల్లీలో భారీగా పోలీసులను ఎందుకు మోహరిస్తున్నారో వివరించాలన్నారు. జ్ఞానేశ్ కుమార్ నేతృత్వంలో జరుగుతున్న చర్యల వల్ల రాజకీయంగా లబ్ధి పొందుతున్నది బీజేపీ మాత్రమేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బీజేపీకి కొంతమేర బలం ఉన్న రాష్ట్రాల్లో ఆ పార్టీ విజయాలకు ఓటర్ల జాబితాలో జరుగుతున్న మార్పులు కూడా కారణమనే అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణలో పూర్తి పారదర్శకత ఉండాలని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా చర్యలు తీసుకోవాలని సీఎం డిమాండ్ చేశారు.

**జనాభా పెరుగుతుంటే ఓట్లు ఎలా తగ్గుతాయి?**

2014లో నరేంద్ర మోదీ తొలిసారి ప్రధానమంత్రి పదవికి పోటీ చేసిన సమయంలో దేశంలో సుమారు 81 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని రేవంత్‌రెడ్డి తెలిపారు. 2019లో ఈ సంఖ్య సుమారు 91 కోట్లకు, 2024 ఎన్నికల నాటికి సుమారు 97 కోట్లకు చేరిందని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. 2026లో ఇప్పటికే 13 కోట్ల ఓట్లను తొలగించారని ఆరోపించారు. ఈ తొలగించే ఓట్ల సంఖ్యను 20 కోట్లకు పెంచే కుట్ర ప్రయత్నం జరుగుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. 2014లో దేశ జనాభా ఎంత? ప్రస్తుతం ఎంత? అనే వివరాలను పరిశీలించాలన్నారు. జనాభా పెరుగుతున్నప్పుడు ఓటర్ల సంఖ్య తగ్గడానికి కారణమేంటని సీఎం ప్రశ్నించారు. జనాభా పెరిగితే ఓటర్ల సంఖ్య పెరగాలా? తగ్గాలా? అన్నది సాధారణ ప్రశ్నేనని, దీనికి ఎన్నికల సంఘం స్పష్టమైన సమాధానం చెప్పాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ అంశంపై రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్పందించాలని కోరారు. రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలు ప్రజల సందేహాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు.

**ఓటు ఉన్నవారు.. లేనివారంటూ రెండు వర్గాలా?**

దేశంలో ఓటు హక్కు ఉన్నవారు, ఓటు హక్కు లేనివారనే రెండు వర్గాలను సృష్టించే పరిస్థితి ఏర్పడుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలను శ్రీమంతులు, పేదలు అనే వర్గాలుగా విడదీసి, పేదల ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని సీఎం ఆరోపించారు. సంపన్నులు బీజేపీకి మద్దతుగా ఉంటారని, పేదలు ఆ పార్టీకి వ్యతిరేకంగా ఉంటారనే రాజకీయ లెక్కలతో ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారనే అనుమానాలు ఉన్నాయన్నారు. ఓటు హక్కును తొలగించడం ద్వారా కొన్ని వర్గాల ప్రజలను రెండో తరగతి పౌరులుగా మార్చే ప్రయత్నాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన సమాన హక్కులు ప్రతి పౌరుడికీ అందాలని, పేదలు, దళితులు, గిరిజనులు సహా అన్ని వర్గాల ప్రజలకు ఓటు హక్కు ఉండాలని స్పష్టం చేశారు.

**రాహుల్ నాయకత్వంలో ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటం**

ఆనాడు 'సైమన్ గో బ్యాక్' నినాదం స్వాతంత్ర్య పోరాటానికి కొత్త ఊపునిచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇప్పుడు రాహుల్‌గాంధీ నేతృత్వంలో సాగుతున్న 'జ్ఞానేశ్ గో బ్యాక్' ఉద్యమం దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు, ఓటు హక్కును కాపాడేందుకు దోహదపడుతుందన్నారు. గాంధీ కుటుంబం దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిందని, ఇప్పుడు అదే కుటుంబానికి చెందిన రాహుల్‌గాంధీ 'ఓట్ చోరీ' ప్రచారం ద్వారా ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు పోరాటం చేస్తున్నారని సీఎం తెలిపారు. అందులో భాగంగానే తాము ఢిల్లీకి వచ్చి నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటున్నామని చెప్పారు. ఈ పోరాటాన్ని మరో స్వాతంత్ర్య ఉద్యమం మాదిరిగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. పేదలు, దళితులు, గిరిజనులకు ఓటు హక్కు ఉండకూడదనే అభిప్రాయాలను బీజేపీ, దాని సైద్ధాంతిక గురువైన ఆర్ఎస్ఎస్ నాయకులు గతంలో వ్యక్తం చేశారని ముఖ్యమంత్రి

రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అయితే, బాబాసాహెబ్ అంబేడ్కర్ అన్ని వర్గాల ప్రజలకు ఓటు హక్కు కల్పించారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీఎం అన్నారు. ఓటర్ల జాబితా నుంచి అర్హులైన వారి పేర్లను తొలగించే ప్రయత్నాలను తక్షణమే నిలిపివేయాలని, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం కలిగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్, ఇండియా కూటమి తమ పోరాటాన్ని కొనసాగిస్తాయని సీఎం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ పరిశీలకులు సచిన్ సావంత్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## పల్లె సీను సాహిత్యం అమూల్యమైనది

- రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డా. రియాజ్
- ఘనంగా పల్లె సీను పుస్తకావిష్కరణల ఉత్సవం



**కాకతీయ,హన్మకొండ :** నా చిన్ననాటి గురువు, కవి,రచయిత అయిన పల్లె సీను సాహిత్యం భవిష్యత్తు తరాలకు అమూల్యమైన సాహితీ సంపద అని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డా రియాజ్ అన్నారు. పల్లె సీను సహస్ర చంద్ర దర్శన వేళ ఆయన రచించిన ఐదు పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం హరిత కాకతీయ లో ఘనంగా జరిగింది. శ్రీలేఖ సాహితి,వరంగల్లు స్వర్ణోత్సవ సంవత్సరాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రియాజ్ విశిష్ఠ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె సీను లాంటి గురువు ఈ రోజుల్లో లేరని అన్నారు. ఆయన సాహిత్యం భవిష్యత్ తరాలకు గొప్ప మార్గదర్శిగా ఉంటుందని అన్నారు. మరో అతిథి దహగాం సాంబమూర్తి మాట్లాడుతూ పల్లె సీను ఆలోచనలు సాహిత్య మూలలను పరిచయం చేస్తుందని, వచనా కవిత్వంపై ఆయనకు గొప్ప పట్టు ఉందని అన్నారు. అనంతరం ప్రముఖ రచయిత, శ్రీ లేఖా సాహితి ఉపాధ్యక్షులు పల్లె సీను రచించిన గగన తరంగాలు, మైత్రీ భావ తరంగాలు, పల్లె అంతరంగం, నేను కవిత్వాన్ని, నా సాహిత్య సంబంధాలు పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐతా చంద్రయ్య, డా. మడత భాస్కర్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు డా రియాజ్, కందుకూరి శ్రీరాములు, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, డా. పర్చా అంజనీదేవి, టి. ఉడయవర్లు,డా.అమ్మిన శ్రీనివాసరాజు, రచయిత, సీనియర్ జర్నలిస్ట్ శంకేశి శంకర్రావు, వరిగొండ కాంతారావు , పల్లె నాగేశ్వర్ రావు డా. ఎన్ వి ఎన్ చారి, గుడిపాటి, డా. పల్లేరు వీరా స్వామి పల్లె సీను రచించిన పుస్తకాలను సభికులకు పరిచయం చేశారు. ఈ సమావేశంలో సాహితీ మిత్రులు, అభిమానులు పాల్గొన్నారు.

## వీడియో కాన్ఫరెన్స్ వీక్షించిన సర్పంచులు రైతులు



**కాకతీయ,నెల్లికుదురు :** ప్రభుత్వం ఎల్ నినో పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ను మండలంలోని మునిగలవేడు రైతు వేదికలో సోమవారం రైతులు, ప్రజా ప్రతినిధులు ఏ ఈ ఓ ప్రతిభ ఆహ్వానం మేరకు హాజరై వీక్షించారు.మునిగల వీడు సర్పంచి బొల్లికొండ చైతన్య నాగరాజు, ఉపసర్పంచి కొమ్మనబోయిన మల్లయ్య,మదనతుర్తి సర్పంచి వడ్ల కొండ రాధ యాకయ్య,బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు నల్లాని పాపారావు,వివిధ గ్రామాల రైతులు ఎల్ నినో పై జరిగిన వీడియో కాన్ఫరెన్స్ ను ఆసక్తిగా తిలకించారు. ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు, ఇతర అధికారులు ఎల్ నినో ప్రభావం వ్యవసాయం తో పాటు దాని అనుబంధ రంగాలపై పడుతుందని తెలిపారు. విద్యుత్ సరఫరాకు కొంత అంతరాయం ఏర్పడవచ్చుని,సాగునీరు త్రాగునీరు కు ఇబ్బందులు కలిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. నీటి ఆధారిత పంటలు కాకుండా ఆరుతడి పంటల వైపు రైతాంగం దృష్టి సారించాలని పేర్కొన్నారు.ఎల్ నినో ను అధిగమించేందుకు అవసరమగు ముందస్తు చర్యలు తీసుకోవాలని చించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.వెంకన్న, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రతిభ, నాయకులు దేవేందర్ రాజలింగం,దుస్స లింగయ్య,జనార్ధన్ ఫీల్డ్ అసిస్టెంట్ రవి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జంతర్ మంతర్ లో కాంగ్రెస్ పాదయాత్ర

- సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామాకు డిమాండ్
- ఏఐసీసీ, టీపీసీసీ పిలుపుతో ఢిల్లీలో భారీ నిరసన
- వరంగల్ కాంగ్రెస్ నేతల హాజరు




**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ పాదయాత్ర, నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ నిరసనలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, జాటోతు రామచంద్రు నాయక్, కెఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, టీపీసీసీ ఉపాధ్యక్షుడు నమ్మిండ్ల శ్రీనివాస్ తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, పార్టీ ఉన్నత శ్రేణులు ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను కాపాడాలని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని నినాదాలు చేశారు.

## భార్య, అత్త, కుమారుడిపై కోడవలితో దాడి

- కేకలు విని పరుగెత్తుకొచ్చిన స్థానికులు
- నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగింత



**కాకతీయ , ఏటూరునాగారం :** భార్య, అత్త, కుమారుడిపై ఓ వ్యక్తి కోడవలితో విచక్షణారహితంగా దాడికి పాల్పడిన ఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రొయ్యూరు గ్రామంలో కలకలం రేపింది. కుమ్మరి చంద్రప్రసాద్ తన తల్లి అంత్యక్రియలు నిర్వహించిన అనంతరం అత్తగారి ఊరైన రొయ్యూరుకు వచ్చి భార్య, పిల్లలతో కలిసి భోజనం చేసి మంచంపై పడుకున్నాడు. ఈ క్రమంలో దుర్గం రామక్క ఇంటికి వచ్చి మాట్లాడుతుండగా, మంచంపై ఉన్న చంద్రప్రసాద్ ఒక్కసారిగా లేచి భార్య, అత్త, కుమారుడిపై కోడవలితో దాడికి దిగాడు. బాధితులు కేకలు వేయడంతో అప్రమత్తమైన స్థానికులు అక్కడికి చేరుకుని నిందితుడి కళ్లలో ఇసుక చల్లి, చేతులు, కాళ్లను తాళ్లతో కట్టేసి అదుపులోకి తీసుకున్నారు. సమాచారం అందుకున్న ఏటూరునాగారం ఎస్సై మహేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని చంద్రప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన వారిని ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై విచారణ జరిపి నిందితుడిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నాయి.

## బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



**కాకతీయ, ఎల్కతుర్తి :** మండలంలోని ముగ్గురు బీఆర్ఎస్ నాయకులు ఇటీవల మృతి చెందడంతో, వారి కుటుంబ సభ్యులను హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎల్కతుర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, గ్రామ శాఖ అధ్యక్షుడు జంగం రాజు, అదే గ్రామానికి చెందిన సూరవరం వేమారెడ్డి, వీరనారాయణపూర్ గ్రామ బీఆర్ఎస్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు సదరం రమేష్ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించి, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాపై చేసిన ఫిర్యాదు అవాస్తవం

- జేఎన్‌టీయూలో అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి
- ఫోన్ కాల్ రికార్డులు, సీసీటీవీ దృశ్యాలు పరిశీలించాలి
- మహిళా ప్రొఫెసర్లకు వీసీ క్షమాపణ చెప్పాలి
- ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్పష్టం



**కాకతీయ, వరంగల్ బ్యూరో :** నాపై చేసిన ఫిర్యాదు అవాస్తవమని, జేఎన్‌టీయూలో మహిళా ప్రొఫెసర్లను వీసీ దూషించిన అంశంపైనే ఆయనను ప్రశ్నించానని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. తనను తిట్టినట్లు, బెదిరించినట్లు చేసిన ఆరోపణలను ఖండిస్తూ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ మేరకు పేర్కొన్నారు. జేఎన్‌టీయూలో జరుగుతున్నాయని చెబుతున్న అవినీతి, అక్రమాలపైనా సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జేఎన్‌టీయూ వైస్ ఛాన్సలర్ కిషన్‌కుమార్‌రెడ్డి భార్య సుజనా రెడ్డి ఎవరో తనకు తెలియదని, ఆమెను ఎప్పుడూ చూడలేదని, మాట్లాడలేదని పల్లా తెలిపారు. మహిళా ప్రొఫెసర్లను వీసీ దూషించిన అంశంపై మాత్రమే ఆయనను ప్రశ్నించానన్నారు. ఈ విషయంలో తప్పు జరిగిందని వీసీ అంగీకరించి క్షమాపణ చెప్పారని, తిరుపతి నుంచి తిరిగొచ్చాక లిఖిత పూర్వకంగా క్షమాపణ పత్రం ఇస్తానని హామీ ఇచ్చారని వెల్లడించారు. మరుసటి రోజు సాయంత్రం వరకు ఆ పత్రం ఇవ్వకపోవడంతో మహిళా ప్రొఫెసర్లు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. వాస్తవాలు వెలుగులోకి రావాలంటే వీసీతో తాను మాట్లాడిన ఫోన్ కాల్ రికార్డులు, సంబంధిత సీసీటీవీ దృశ్యాలను పోలీసులు పరిశీలించాలని కోరారు.

**యూనివర్సిటీలో అవినీతిపై విచారణ జరపాలి**

జేఎన్‌టీయూలో కాంట్రాక్టుల కేటాయింపు, డైరెక్టర్లు, డీన్ల నియామకాలు, బదిలీలు, విధానపరమైన నిర్ణయాల్లో వీసీ భార్య జోక్యం చేసుకుంటున్నారంటూ పల్లా ఆరోపించారు. యూనివర్సిటీ క్వార్టర్‌ను బార్‌లా మార్చడం, వివిధ క్లబ్‌ల కేంద్రంగా వసూళ్లకు పాల్పడటం వంటి ఆరోపణలపైనా సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు. జేఎన్‌టీయూ దేశ, విదేశాల్లో గుర్తింపు పొందిన ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ అని, దాని అనుబంధ కళాశాలల్లో తన సంస్థలకు చెందిన సుమారు 10 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని పల్లా తెలిపారు. యూనివర్సిటీ ప్రతిష్ఠ పెరిగితే విద్యార్థులు, అనుబంధ కళాశాలలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం విద్యాసంస్థ గౌరవాన్ని దెబ్బతీసే చర్యలకు ఎవరూ మద్దతు ఇవ్వవద్దని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం, పరిశోధనలు ప్రోత్సహించడం, నూతన ఆవిష్కరణలు, ప్రాజెక్టులు, పేటెంట్ల సాధనపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. మహిళా ప్రొఫెసర్ల పట్ల వీసీ వ్యవహరించిన తీరుపై క్షమాపణ చెప్పడంతోపాటు, యూనివర్సిటీలో అవినీతి ఆరోపణలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయానికి సమష్టి కృషి

- అర్హులైన ప్రతి పట్టభద్రుడినీ ఓటరుగా నమోదు చేయించాలి
- ప్రతి వార్డు, బూత్‌లో క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు



**కాకతీయ, పరకాల :** వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించే బాధ్యతను పార్టీ శ్రేణులు తీసుకోవాలని సూచించారు. పరకాలలోని బీజేపీ పట్టణ కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పరకాల మండల కన్వీనర్ ఆకుల శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పట్టణంలోని ప్రతి వార్డు, ప్రతి బూత్ పరిధిలో నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పర్యటించాలని కాళీ ప్రసాద్ రావు సూచించారు. అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని, అవసరమైన సహకారం అందించాలని పేర్కొన్నారు. ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, వివిధ మోర్చాల బాధ్యులు, బూత్ అధ్యక్షులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

**సమన్వయంతో ఎన్నికల కార్యాచరణ**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన అన్నారు. సమావేశంలో పట్టభద్రుల ఓటరు నమోదు విధానం, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, పట్టభద్రులను చైతన్య పరిచే కార్యాచరణ, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించేలా కృషి చేయాలని పార్టీ శ్రేణులు సంకల్పించాయి. ఈ సమావేశంలో పరకాల మున్సిపల్ కౌన్సిలర్ కుక్కల విజయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్పీ జయంతిలాల్, దేవునూర్ మేఘనాథ్, జిల్లా కోశాధికారి ఎర్రం రామన్న, పట్టణ ఉపాధ్యక్షుడు మిడిదొడ్డి నరేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి సంఘ పురుషోత్తం, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకురాలు వేముల సధారాణి, ఓబీసీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి ఉడుత చిరంజీవి, బీజేపీ నాయకులు మార్త రాజా భద్రయ్య, బాసాని సోమరాజు, ఆకుల రాంబాబు, గునిగంటి రఘుపతి, పైండ్ల రంజిత్, వినిశెట్టి శారద, బీరం రాజిరెడ్డి, దంచనాదుల కిరణ్, ముత్యాల దేవేందర్, కాగితపు చంద్రమోహన్, బీజేవైఎం జిల్లా నాయకులు కక్కు రాజు, రంతుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మిల్స్ కాలనీలో ఆపరేషన్ చెబుత్రా

- 10 బైక్ లు, 24 సెల్ ఫోన్లు స్వాధీనం - 28 మందిపై కేసులు
- సీపీ శ్వేత ఆదేశాలతో దూకుడు పెంచిన పోలీసులు
- కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్
- ఆపరేషన్ నిరంతరం కొనసాగుతుందన్న ఇన్స్పెక్టర్ కర్రె స్వామి




**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఐపీఎస్ ఆదేశాల మేరకు మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి "ఆపరేషన్ చెబుత్రా" నిర్వహించారు. ఈ ఆపరేషన్ లో భాగంగా చింతల్, అబ్బనికుంట, లేబర్ కాలనీ, ఫోర్ట్ వరంగల్, శివనగర్, ఎస్ఆర్ఆర్ తోట, ఉర్సుగుట్ట, కరీమాబాద్, ఉర్సు, శంభునిపేట, రంగశాయిపేట తదితర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. అర్ధరాత్రి వేళ అనవసరంగా రోడ్లపై తిరుగుతూ, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ, ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న 28 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి 10 మోటార్ సైకిళ్లు, 24 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అందులో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన 15 మందిపై సిపి Act 70(ఏ) కింద, మరో 13 మందిపై ప్రజలకు ఇబ్బంది కలిగిస్తూ న్యూసెన్స్ కు పాల్పడినందుకు సిపి యాక్ట్ 21, 70, 76 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. అనంతరం అదుపులోకి తీసుకున్న 28 మందికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. అర్ధరాత్రి వేళ బయట తిరగడం, బహిరంగంగా మద్యం సేవించడం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఆపరేషన్ చెబుత్రా ఒక నిరంతర ప్రక్రియ అని, ఇక నుండి ప్రతిరోజూ కొనసాగుతుందని మిల్స్ కాలనీ ఇన్స్పెక్టర్ కర్రె స్వామి హెచ్చరించారు. అవసరమైతే తప్ప రాత్రి వేళల్లో బయట తిరగవద్దని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్ లో ఇన్స్పెక్టర్ కర్రె స్వామితో పాటు ఇతర సర్కిల్ ఇన్స్పెక్టర్లు మంగిలాల్, ఎస్. శ్రీనివాస్, ఐ. శ్రీనివాస్, శ్యాంసుందర్, పలువురు ఎస్సైలు, టాస్క్ ఫోర్స్, క్విక్ రెస్పాన్స్ టీం సహా 40 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలి

- ఓటర్ల జాబితాలో అక్రమాలపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలి
- రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పోరాటం
- టీపీసీసీ నేత డా. పెరుమాండ్ల రామకృష్ణ



**కాకతీయ, హన్మకొండ :** ఓటర్ల జాబితాలో అక్రమాలపై నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, టీపీసీసీ నేత డా. పెరుమాండ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఏఐసీసీ పిలుపు మేరకు అక్టోబర్ 12న ఢిల్లీలో నిర్వహించిన మార్చ్ నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణల పేరుతో జరుగుతున్న అక్రమాలపై ఎన్నికల సంఘం పారదర్శకంగా సమాధానం చెప్పాలని కోరారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగ హక్కు అని, దాని పరిరక్షణ కోసం కాంగ్రెస్ ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య, రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో, ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు, పీసీసీ అధ్యక్షుడు బి. మహేష్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ నిరసనలో పాల్గొన్నారు. రాజ్యసభ సభ్యుడు వేమ్ నరేందర్‌రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జి సచిన్ సావంత్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొన్నారని తెలిపారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని డా. పెరుమాండ్ల రామకృష్ణ పేర్కొన్నారు.

## ఆకాంక్ష్ పటేల్ విజయం స్ఫూర్తిదాయకం

- స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షలో ప్రతిభ
- ఆదాయపు పన్ను శాఖ సూపరింటెండెంట్‌గా ఎంపిక
- కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు మండల నర్సింహరాములు



**కాకతీయ, వరంగల్:** నిరంతర శ్రమ, కృషి, పట్టుదలతో ఉన్నత ఉద్యోగాన్ని సాధించిన ఆకాంక్ష్ పటేల్ విజయం స్ఫూర్తిదాయకమని కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు మండల నర్సింహరాములు అన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఆదాయపు పన్ను శాఖలో సూపరింటెండెంట్‌గా ఎంపికై ఉద్యోగంలో చేరిన రంగశాయిపేటకు చెందిన శంకేసి ఆకాంక్ష్ పటేల్‌ను అభినందిస్తూ సోమవారం స్థానికంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహరాములు మాట్లాడుతూ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షలో ప్రతిభ కనబరిచి ఉన్నత ఉద్యోగాన్ని సాధించడం అభినందనీయమన్నారు. ఆకాంక్ష్ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ తనవంతు తోడ్పాటు అందించాలని సూచించారు. ఆకాంక్ష్‌ను ప్రోత్సహించిన తల్లిదండ్రులు శంకర్‌రావు, వాణిని అభినందించారు. అనంతరం ఆకాంక్ష్ పటేల్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సమితి న్యాయ నిర్ణేతలు కత్తి సాంబయ్య, జక్కం దామోదర్, కోల రాము, బొలిశెట్టి కమలాకర్, ఎలుగు రవికుమార్, సుంకర సుధాకర్, బూర సంతోష్‌కుమార్, కొట్టే వినయ్‌కుమార్, కత్తరపెల్లి వేణు, సుంకర సుజాతదేవి తదితరులు పాల్గొన్నారు.

## నెల్లికుదురు ప్రజావాణికి 13 దరఖాస్తులు



**కాకతీయ,నెల్లికుదురు :** మండల కేంద్రం నెల్లికుదురు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో తహసిల్దార్ చంద నరేష్ తోపాటు పలు శాఖల అధికారులు పాల్గొని ప్రజలు తమ సమస్యలపై సమర్పించిన వినతులను స్వీకరించారు.అనంతరం ఎంపీడీవో కార్యాలయ సూపరిండెంట్ నర్సింగరావు దరఖాస్తుల తెలుపుతూ ప్రజావాణి కి మండల వ్యాప్తంగా ప్రజలు తమ సమస్యలపై 13దరఖాస్తులు అందజేసినట్లు నీటి సమస్యపై1, విద్యుత్ 2,వ్యవసాయంపై2, రెవిన్యూ3, హౌసింగ్ 3, పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ 1, ట్రైబల్ వెల్ఫేర్ సమస్యపై 1,దరఖాస్తు బాధితుల నుంచి అందినట్లు సూపర్డెంట్ తెలిపారు.ప్రజావాణిలో వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరవుతున్న ,మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి దృష్టికి తీసుకువచ్చి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శిని నియమించండి

- కార్యదర్శి లేక ప్రజలకు తప్పని ఇబ్బందులు
- బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు దోనపాటి జనార్దన్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు గొల్లేన వంశీ డిమాండ్

**కాకతీయ, దుగ్గొండి :** మండల పరిధిలోని తిమ్మంపేట గ్రామపంచాయతీకి పూర్తిస్థాయి పంచాయతీ కార్యదర్శిని నియమించాలని బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు దోనపాటి జనార్దన్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు గొల్లేన వంశీ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో మండల అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి శాశ్వత పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో వివిధ పనుల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామపంచాయతీకి సంబంధించిన పనులు, సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి తిమ్మంపేటకు పూర్తిస్థాయి పంచాయతీ కార్యదర్శిని నియమించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు.

## అనారోగ్యంతో కారోబార్ మృతి. పలువురు పరామర్శ



**కాకతీయ, పెద్దవంగర:** మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం పోచంపల్లి గ్రామ కారోబార్ ఓరిగంటి సోమ నరసయ్య సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు.అతని మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అయ్యారు. అతడి మృతి పట్ల పలువురు మండల నాయకులు, కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు.

## నేరాల కట్టడికి కమాండ్ కంట్రోల్ సెంటర్

- 467 సీసీటీవీ కెమెరాల అనుసంధానం
- అనుమానాస్పద కార్యకలాపాలపై నిరంతర నిఘా
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**కాకతీయ, కొత్తగూడెం:** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, దర్యాప్తును మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ సూచించారు. సోమవారం చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన, నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ సీసీటీవీ కెమెరాలతో పాటు పోలీస్ స్టేషన్లలోని కెమెరాలను ఈ కేంద్రానికి అనుసంధానించారు. ప్రస్తుతం మొత్తం 467 సీసీటీవీ కెమెరాలు అనుసంధానమయ్యాయని తెలిపారు. ఈ వ్యవస్థ ద్వారా ఆయా ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించడం, అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించడం, అత్యవసర సమయాల్లో తక్షణమే స్పందించడం సులభమవుతుందని పేర్కొన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణతో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భగవాన్ దాస్ ఆశయాలు చిరస్మరణీయం

- కార్మికుల హక్కుల కోసం ఆయన పోరాటం స్ఫూర్తిదాయకం
- పేదలకు ఇళ్ల స్థలాల సాధనలో కీలక పాత్ర
- మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్

**కాకతీయ, హనుమకొండ:** ప్రజల హక్కుల పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, పేదలకు ఇళ్ల స్థలాల సాధన కోసం ప్రముఖ కార్మిక నాయకుడు, కమ్యూనిస్టు యోధుడు బీఆర్ భగవాన్ దాస్ చేసిన పోరాటాలు నేటికీ స్ఫూర్తిదాయకమని మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. సోమవారం హనుమకొండలో భగవాన్ దాస్ 23వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి సీపీఐ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ నీతి, నిజాయితీ, నిబద్ధతతో జీవితాంతం ప్రజల కోసం పనిచేసిన గొప్ప నాయకుడు భగవాన్ దాస్ అని కొనియాడారు. సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు చేశారని, ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడటంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఆయన పరిరక్షించిన స్థలంలోనే నేడు కాళోజీ కళాక్షేత్రం నిర్మించారని తెలిపారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని పోరాడారని పేర్కొన్నారు. నగరంలోని పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, గుడిసెల్లో నివసిస్తున్న వారికి పట్టాలు ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు నడిపారని వివరించారు. భగవాన్ దాస్ ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు కర్రె లక్ష్మణ్, ఎన్. రాజమౌళి, ఏదునూరి వెంకట్రాజం, ఏశబోయిన శ్రీనివాస్, బత్తిని సదానందం, మాలోతు శంకర్, మెట్టు శ్యామ్ సుందర్‌రెడ్డి పాల్గొన్నారు. భగవాన్ దాస్ కుమారులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టర్ బి. రాజ్ సిద్ధార్థ, బీఆర్ లెనిన్, మాజీ కార్పొరేటర్లు మంచాల స్వామిచరణ్, జోరిక రమేష్, సారంగపాణి, జర్నలిస్టు నాయకులు పీవీ మదన్‌మోహన్, తోట సుధాకర్, బొల్లారపు సదయ్య, బొడిగె శ్రీనివాస్, ఎండీ నయీం తదితరులు పాల్గొన్నారు.

# రబీలో వరి సాగు చేయొద్దు

- ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ఆరుతడి పంటలకు ప్రాధాన్యం
- నీటి పొదుపుపై రైతులు దృష్టి సారించాలి
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**కాకతీయ, దామెర :** ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రబీ సీజన్‌లో రైతులు వరి సాగు చేయకుండా ఆరుతడి, స్వల్ప కాలిక పంటలకు ప్రాధాన్యమివ్వాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్ నుంచి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో కలిసి రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దామెర రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు కార్యక్రమాన్ని వీక్షించారు. బిందు సేద్యం ద్వారా పామాయిల్ తోటలు, కూరగాయలు వంటి పంటలు సాగు చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. ఇంకుడు గుంతలు, నీటి కుంటల ఏర్పాటు, బోరుబావుల పునరుద్ధరణతో జలవనరులను కాపాడుకోవాలని తెలిపారు. రాష్ట్రంలోని 315 మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైందని, త్వరలో కరువు మండలాలను ప్రకటించనున్నట్లు వెల్లడించారు. భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో రైతులు నీటిని పొదుపుగా వినియోగిస్తూ ఆరుతడి పంటలు సాగు చేయాలని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కల్పన, అదనపు కలెక్టర్ శేషాద్రి, వ్యవసాయ శాఖ అధికారి విజయ్ చంద్ర, డీఆర్డీవో మేన శ్రీను, తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, ఎంపీడీవో కల్పన, రైతులు పాల్గొన్నారు.

# ములుగుకు రూ.3 కోట్ల విద్యుత్ నిధులు

- ఇళ్ల మీదుగా వెళ్తున్న లైన్ల మార్పునకు నిధుల మంజూరు
- మంత్రి సీతక్క విజ్ఞప్తికి ప్రభుత్వ ఆమోదం



GOVERNMENT OF TELANGANA
ABSTRACT
ENERGY (POWER.I) DEPARTMENT
G.O.Rt.No.32
Dated.08.10.2026
(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)
NAVIN MITTAL
SPECIAL CHIEF SECRETARY TO GOVERNMENT
//FORWARDED :: BY ORDER//
SECTION OFFICER

**కాకతీయ, ములుగు :** ములుగు నియోజకవర్గంలో ఇళ్ల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్ల సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం రూ.3 కోట్ల నిధులకు ఆమోదం తెలిపిందని మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. ప్రజల భద్రతకు ముప్పుగా మారుతున్న విద్యుత్ లైన్లను మార్చాలని ఆమె చేసిన విజ్ఞప్తికి ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించడంతో నిధుల మంజూరుకు మార్గం సుగమమైంది. నివాస గృహాల మీదుగా విద్యుత్ లైన్లు వెళ్లడంతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రమాదాల ముప్పును మంత్రి సీతక్క ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. లైన్ల మార్పు, విస్తరణ పనులు చేపట్టి ప్రజలకు భద్రత కల్పించాలని, అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ సమర్పించిన ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలించి ఆమోదించింది.

**ఈ నెల 8న ఉత్తర్వులు జారీ**

విద్యుత్ లైన్ల మార్పు, విస్తరణ పనులకు రూ.3 కోట్ల అంచనా వ్యయాన్ని ఆమోదిస్తూ ఈ నెల 8న ఇంధన శాఖ జీవో నంబర్ 32 జారీ చేసింది. ఆర్థిక శాఖ సమ్మతితో ఉత్తర్వులు వెలువడ్డాయి. పనుల అమలుకు అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. రూ.3 కోట్ల నిధులకు ఆమోదం లభించడంతో విద్యుత్ లైన్ల మార్పు, విస్తరణ పనుల ప్రారంభానికి తదుపరి చర్యలు చేపట్టనున్నారు. పనులు పూర్తయితే ఇళ్ల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్లతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తగ్గడంతోపాటు భద్రత మెరుగుపడనుంది. దీర్ఘకాలంగా నెలకొన్న సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్న మంత్రి సీతక్కకు ములుగు నియోజకవర్గ ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# ప్రజావాణికి 153 అర్జీలు

- సత్వర పరిష్కారానికి ఆదేశం
- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- రెవెన్యూకు 47, బల్దియాకు 42 అర్జీలు



కాకతీయ, వరంగల్ ప్రతినిధి: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి మొత్తం 153 అర్జీలు స్వీకరించారు. అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 47, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కు 42, డీఆర్డీఏకు 13, వివిధ శాఖలకు సంబంధించి 51 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఇచ్చిన అర్జీలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత సమయంలో పరిష్కార చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్జీదారులకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) వైవీ గణేష్, డీఆర్వో విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ వసంత, హౌసింగ్ పీడీ విష్ణువర్ధన్ రెడ్డి, డీఎం అండ్ హెచ్వో రాజిరెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం



**కాకతీయ, నెల్లికుదురు :** అనారోగ్యం తో మృతిచెందిన చిన్న నాటి స్నేహితురాలి కుటుంబ సభ్యులకు ఆమెతో కలిసి చదువుకున్న మిలినియం బ్యాచ్ స్నేహితులు ఆర్థిక సహాయం అందించారు వివరాల్లోకి వెలితే నెల్లికుదురు మండలకేంద్రం కు చెందిన గరిగంటి వెంకటలక్ష్మి తీవ్ర అనారోగ్యం కారణంగా ఈ నెల 04 న మృతి చెందింది భర్త ఉన్నా ఆదరణ లేక ఇద్దరు కూతుళ్ళను కష్టపడి చదివించుకుంది కన్న తండ్రి ఆదరణ లేక జన్మనిచ్చిన తల్లి మరణించడంతో ఇద్దరు ఆడపిల్లలు దిక్కుతోచని స్థితిలో పడిపోవడంతో చలించిన స్నేహితులు మృతురాలి కూతుళ్లకు రూ.22,700 వేలు ఆర్థిక సహాయం అందచేసి ఉదారతను చాటుకున్నారు కార్యక్రమం లో పుప్పాల శారద, చెన్నూరి చంద్రకళ, జెల్ల ఉపేందర్, గార ఉపేందర్ ఎస్ ఎస్ సి బ్యాచ్ సభ్యులు పాల్గొన్నారు.

# హరీశ్‌రావును కలిసిన రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ రాజ్‌కుమార్



**కాకతీయ, దుగ్గొండి :** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా వైస్ చైర్మన్‌గా ఎన్నికైన శానబోయిన రాజ్‌కుమార్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్‌రెడ్డితో కలిసి ఆయన హరీశ్‌రావును కలిశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్‌ను హరీశ్‌రావు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వరంగల్ జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, విద్యార్థి నాయకుడు మాచర్ల శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితాలో అక్రమాలు.. ఈసీ రాజీనామా చేయాలి

- రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది
- బ్యాలెట్ పేపర్ విధానాన్ని పునరుద్ధరించాలి
- ఓటు హక్కు పరిరక్షణకు పోరాటం ఆగదు
- హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి






**కాకతీయ, వరంగల్ బ్యూరో:** ఓటు హక్కును, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం వైఖరికి నిరసనగా ఏఐసీసీ, ఇండియా కూటమి ఆధ్వర్యంలో సోమవారం ఢిల్లీలో నిర్వహించిన పార్లమెంట్ నుంచి సుప్రీంకోర్టు వరకు నిరసన మార్చ్‌లో ఆయన పాల్గొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను, రాజ్యాంగ సంస్థలను ఉపయోగించుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తోందని ఇనగాల విమర్శించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో దేశవ్యాప్తంగా భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని, లక్షలాది మంది పేర్లు తొలగించారని ఆరోపించారు. సుమారు 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించినట్లు పేర్కొంటూ ఈ వ్యవహారానికి నైతిక బాధ్యత వహించి కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెరగాలంటే బ్యాలెట్ పేపర్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు.

**ఢిల్లీలో కాంగ్రెస్ శ్రేణుల నిరసన**

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పిలుపు మేరకు.. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్‌కుమార్‌గౌడ్ మార్గదర్శకత్వంలో హనుమకొండ జిల్లా నుంచి కాంగ్రెస్ శ్రేణులు ఢిల్లీకి తరలి వెళ్లాయి. ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు 24 అక్బర్ రోడ్ నుంచి సుప్రీంకోర్టు వైపు సాగిన నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. బరాఖంబ మెట్రో స్టేషన్ వద్ద మీడియాతో మాట్లాడిన ఇనగాల.. నిరసనను అడ్డుకునేందుకు పోలీసులు మూడు అంచెల బారికేడ్లు ఏర్పాటు చేశారని, యువజన సంఘాల నాయకులతో పాటు పలువురు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. అయినప్పటికీ కాంగ్రెస్ శ్రేణులు వెనక్కి తగ్గలేదన్నారు.

**జిల్లాలోనూ అక్రమాలను ఎండగట్టాం**

హనుమకొండ జిల్లాలో గతంలో ఓటర్ల జాబితా సవరణల సందర్భంగా అక్రమాలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిన అంశాలను క్షేత్రస్థాయిలో ఎండగట్టామని ఇనగాల తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటం, ఓటు హక్కును పరిరక్షించడం కాంగ్రెస్ పార్టీ బాధ్యతగా భావిస్తోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను అపహాస్యం చేస్తోందని విమర్శించారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో రాజ్యాంగ పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు. నిరసన కార్యక్రమంలో తెలంగాణకు చెందిన పలువురు ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రసీదు ఇవ్వకుండా వసూళ్లు

- అధికారుల జేబుల్లోకి మార్కెట్ సొమ్ము
- కిరాయి డబ్బులు సొంత ఖర్చులకు మళ్లింపు
- అధికారి వ్యవహారంపై సెక్రటరీకి బాధితుడి ఫిర్యాదు
- పన్ను వసూళ్లపై జమపై వెలుగులోకి కొత్త కోణాలు




**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** లక్ష్మీపురం మోడల్ కూరగాయల మార్కెట్లో బకాయిల బాగోతం వెనుక వసూళ్లలో భారీ అవకతవకలు ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. వ్యాపారులు చెల్లించిన కిరాయి సొమ్ము మార్కెట్ ఖాతాలో జమ కాకుండా అధికారులు, సిబ్బంది సొంత ఖర్చులకు వాడుకుంటున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఇటీవల ఓ వ్యాపారి తన బకాయి కింద రూ.లక్షకు పైగా చెల్లిస్తే, సంబంధిత అధికారి రసీదు ఇవ్వకుండా ఆ డబ్బును సొంత నిర్వహణ ఖర్చులకు వాడుకున్నట్లు తెలిసింది. దీనిపై బాధిత వ్యాపారి మార్కెట్ సెక్రటరీకి ఫిర్యాదు చేయగా, సంబంధిత అధికారిని పిలిచి మందలించడంతో సరిపెట్టినట్లు సమాచారం. రసీదు లేకుండా డబ్బు తీసుకోవడం సర్వసాధారణంగా మారిందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారుల వద్ద డబ్బులు తీసుకొని రసీదు ఇవ్వకపోవడం వల్ల ఆ సొమ్ము అధికారిక లెక్కలోకి రావడం లేదు. దీంతో వ్యాపారి లెక్కలో కట్టినట్లు ఉన్నా, మార్కెట్ లెక్కలో బకాయిగానే చూపుతోంది. ఇదే అదనుగా కొందరు కిరాయిలు ఎగవేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో మార్కెట్ ఆదాయానికి భారీ గండి పడుతోంది.

**అసలు దుకాణదారులేరీ?**

ఈ కమర్షియల్ షాపులు దక్కించుకున్న వారిలో చాలా మంది స్వయంగా వ్యాపారం చేయడం లేదనే విషయం విచారణలో వెలుగు చూస్తోంది. మార్కెట్ నుంచి తక్కువ కిరాయికి షాపు తీసుకొని, బయట వ్యక్తులకు అధిక కిరాయిలకు ఇచ్చి సొమ్ము చేసుకుంటూ, మార్కెట్‌కు మాత్రం ఎగనామం పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మార్కెట్ బైలా ప్రకారం షాపు దక్కించుకున్న వ్యక్తే వ్యాపారం చేయాలి, సబ్ లెట్ చేయడం నిషేధం. రూ.50 వేలు డీడీ కట్టి రూ.26 లక్షలకు పైగా బకాయి పెట్టినా చర్యలు లేకపోవడం, 15 మంది 50 వేల నుండి లక్ష వరకు బకాయి ఉన్నా ఉదాసీనంగా వ్యవహరించడం, రసీదు లేని వసూళ్లు, సబ్ లెట్ వ్యవహారాలపై పాలకవర్గం, ఉన్నతాధికారులు క్షుణ్ణంగా విచారణ చేపడితే తప్ప అసలు దోషులు బయటకు రారని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు. రాజకీయ జోక్యం లేకుండా బైలా ప్రకారం నిబంధనలు అమలు చేస్తేనే మార్కెట్ అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడుతున్నారు.

# గిరిజన దర్బార్‌లో 7 అర్జీలు

**భూ ఆక్రమణలపై విచారణ జరపాలని వినతి**



**కాకతీయ, ఏటూరునాగారం :** ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు 7 దరఖాస్తులు సమర్పించారు. ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో అర్జీలను స్వీకరించి, సమస్యలను పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌సీఓ మహబూబాబాద్ పరిధిలో ఉద్యోగం, డిప్యూటేషన్, ఆరోగ్య కారణాలతో బదిలీ కోరుతూ మూడు దరఖాస్తులు అందాయి. మంగపేట మండలం అఖినేపల్లి మల్లారం ప్రాంతంలో గిరిజన, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, బదలాయింపులు, మ్యుటేషన్లపై విచారణ జరపాలని ఒకరు కోరారు. పస్రాలోని షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్వహణ, దుకాణాల కేటాయింపులో అదనంగా వసూలు చేసిన మొత్తాల తిరిగి చెల్లింపుపై రెండు అర్జీలు వచ్చాయి. మంగపేట మండల ఆదివాసీ విద్యార్థులకు ఏజెన్సీ ధ్రువపత్రాలు మంజూరు చేయాలని మరో దరఖాస్తు అందింది. ఈ కార్యక్రమంలో ఏపీఓ ప్రతాప్, డీడీ జనార్ధన్, ఈఈ ప్రవీణ, ఏఓ అనిల్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ క్రాంతికుమార్, ఆర్‌సీఓ పద్మిని తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి

- హనుమకొండ జిల్లాలో ప్రజావాణికి 225 అర్జీలు
- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**కాకతీయ, హనుమకొండ :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ సమర్పించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, ప్రతి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌తో పాటు హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, జిల్లాలోని ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాలకు మొత్తం 225 అర్జీలు అందాయి. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో 98 అర్జీలు, హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాల్లో 30 అర్జీలు, ఎంపీడీవో కార్యాలయాల్లో 97 అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి, స్థానిక సంస్థల జిల్లా ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సీఈసీకి వ్యతిరేకంగా సీఐటీయూ ఆందోళన

- జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మ దహనం.. రాజీనామాకు డిమాండ్
- ఎస్ఐఆర్ పేరుతో 13 కోట్ల ఓట్ల తొలగింపు కుట్ర



**కాకతీయ, హనుమకొండ :** చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. నగరంలోని అంబేద్కర్ సెంటర్ లో సీఈసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా "జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి, ఓట్ల తొలగింపును ఆపాలి, రాజ్యాంగాన్ని రక్షించాలి, సీఐటీయూ జిందాబాద్" అంటూ నినాదాలు చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ, "సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఎస్ఐఆర్ పేరుతో దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించేందుకు కుట్ర పన్నుతున్నారని" ఆరోపించారు. ఫామ్ 6 లో మార్పులు వద్దని మిగతా ఇద్దరు ఎలక్షన్ కమిషనర్లు చెప్పినా వినకుండా, సొంత నిర్ణయంతో బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును తొలగిస్తూ, రాజ్యాంగ వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తూ ఆ పదవికే మచ్చ తెస్తున్న జ్ఞానేష్‌కుమార్ ఒక్క క్షణం కూడా ఆ పదవిలో ఉండే అర్హత లేదని, తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సీఈసీ రాజీనామా కోరుతూ విద్యార్థి సంఘాలు, వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తుంటే, ఆందోళనలపై కేంద్ర ప్రభుత్వం 40,000 మందికి పైగా సాయుధ బలగాలను మోహరించి అరెస్టులు, దాడులు చేయడం ఎమర్జెన్సీని తలపిస్తోందని, ఇది దారుణమైన చర్య అని అన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని, ప్రధాని నరేంద్ర మోదీ తక్షణమే సీఈసీతో రాజీనామా చేయించాలని, లేకపోతే బీజేపీ పతనం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి బొట్ల చక్రపాణి, జిల్లా నాయకులు బరుపట్ల మహేష్, మున్నంగి రఘు, విజయ, సుజాత, ఎల్లమ్మ, మొగిలి సమ్మయ్య, పి. రవిలతో పాటు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# ఓరుగల్లుకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ!

- రూ.5,257 కోట్ల ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం
- కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకు రుణంతో పనులకు ముందడుగు
- వరంగల్, హనుమకొండలో ఏడు జోన్లుగా పనులు
- ఏడు చోట్ల మురుగునీటి శుద్ధి కేంద్రాలు
- 66 డివిజన్లలో ప్రణాళికల రూపకల్పన
- 20 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా అంచనాలు





**కాకతీయ, వరంగల్ :** ఓరుగల్లు నగరవాసుల చిరకాల స్వప్నమైన భూగర్భ మురుగునీటి వ్యవస్థకు ముందడుగు పడింది. గ్రేటర్ వరంగల్ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, మురుగునీటి శుద్ధి ప్రాజెక్టులకు రూ.5,257 కోట్ల ప్రతిపాదనలకు కేంద్ర స్థాయిలో ఆమోదం లభించినట్లు సమాచారం. జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకు నుంచి రుణం పొందేందుకు కేంద్ర ఆర్థిక, గృహనిర్మాణ శాఖలు అంగీకరించడంతో ప్రాజెక్టు అమలుపై ఆశలు పెరిగాయి. పనులు పూర్తయితే నగరంలో బహిరంగ మురుగు కాలువల సమస్యకు పరిష్కారం లభించనుంది. ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆర్థిక వ్యవహారాల విభాగం నిర్వహించిన 167వ స్క్రీనింగ్ కమిటీ సమావేశంలో రాష్ట్ర పురపాలక శాఖ కార్యదర్శి డా. టీకే శ్రీదేవి సమర్పించిన వరంగల్ యూజీడీ, సేవరేజ్ ప్రాజెక్టు ప్రతిపాదనలను పరిశీలించారు. రూ.5,257 కోట్ల అంచనాలతో రూపొందించిన ప్రాజెక్టుకు ఆమోదం లభించినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న నేపథ్యంలో త్వరలో శంకుస్థాపన జరిగే అవకాశాలున్నాయి.

**ఏడు జోన్లుగా యూజీడీ పనులు**

వరంగల్, హనుమకొండ నగరాలను ఏడు జోన్లుగా విభజించి భూగర్భ మురుగునీటి వ్యవస్థకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపొందించారు. 66 డివిజన్లలో టెండర్లకు సంబంధించిన ప్రాథమిక పరిశీలన పూర్తయినట్లు సమాచారం. యూజీడీ అమలుకు అవసరమైన మ్యాపుల రూపకల్పన కూడా పూర్తయింది. ప్రాజెక్టు పనులను పురపాలక ప్రజారోగ్య శాఖ అమలు చేయనుండగా, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించనున్నారు. తెలంగాణ పట్టణ మౌలిక సదుపాయాల సంస్థ నోడల్ సంస్థగా వ్యవహరించనుంది. నగర పరిధిలో ఏడు ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా రోజుకు 140 నుంచి 160 మిలియన్ లీటర్ల మురుగునీటిని శుద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాబోయే 20 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు అంచనాలు రూపొందించారు. హనుమకొండ, రెడ్డిపురం, కాజీపేట, బంధం చెరువు, విలాపురం తదితర ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోంది.

**బహిరంగ కాలువలకు చెక్ పడేనా?**

ప్రస్తుతం నగరంలోని పలు ప్రాంతాల్లో బహిరంగ మురుగు కాలువలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులోకి వస్తే మురుగు నీటి పారుదల సమస్యలు తగ్గడంతోపాటు పరిసరాల పరిశుభ్రత మెరుగుపడే అవకాశం ఉంది. అయితే ప్రాజెక్టు ఆమోదం తర్వాత నిధుల విడుదల, టెండర్లు, భూసేకరణ, పనుల ప్రారంభం వంటి దశలు కీలకం కానున్నాయి. ఇవన్నీ సకాలంలో పూర్తయితేనే ఓరుగల్లు ప్రజలకు ఈ ప్రాజెక్టు ప్రయోజనాలు అందనున్నాయి.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at
H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266